# సాంకేతిక విద్యాభివృద్ధిలో జె.ఎన్.టి.యు.కె. గణనీయ ప్రగతి : వి.సి. కుమార్



కాకినాడ, ఫిబ్రవరి 22 (సమాచారమ్ ప్రతినిధి) : జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో చేపట్టిన సాంకేతిక విద్య ప్రగతి లక్ష్యాలను అధికమించి విద్యార్ధిని విద్యార్ధులకు అనేక ప్రయోజనాలను చేకూర్చడం జరిగిందని వైస్‌చాన్సలర్ ప్రొ. వివిఎస్ఎస్.కుమార్ తెలిపారు. గురువారం మధ్యాహ్నం వర్సిటి ప్రాంగణంలో ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తన హయాంలో రెండు సార్లు (2015, 2018) స్నాతకోత్సవ వేడుకలను నిర్వహించామని, జాతీయ స్థాయిలో ఉపకులపతుల సమావేశం నిర్వహించి సాంకేతిక విద్యలో తీసుకురావాల్సిన విప్లవాత్మక మార్పులపై చర్చించామన్నారు. అధ్యాపకుల కొరతను అధిగమించుటకై మ్యాసివ్ ఓపెన్ ఆన్‌లైన్ కోర్సులను జెఎన్‌టియుకె మరియు అనుబంధ కళాశాలల్లో దిగ్విజయంగా నిర్వహిస్తున్నామన్నారు. పరీక్షల నిర్వహణలో పారదర్శకతను పాటించేందుకు జంబ్లింగ్ విధానాన్ని ప్రవేశపెట్టామని, మహిళా కళాశాలలకు ఇందులో మినహాయింపునిచ్చామని, పరీక్షా కేంద్రాలైన కళాశాలలు 25కిలోమీటర్ల పరిధిలో లేకపోతే వాటికి మినహాయింపును ఇవ్వడం జరిగిందన్నారు. పిహెచ్‌డి ప్రవేశాలను నిబంధనలకు అనుగుణంగా కఠినతరమైన విధి విధానాలతో సిఫార్సులకు తావు లేకుండా అర్హత పొందిన అభ్యర్థులకే ప్రవేశాలు కల్పించామని, థీసిస్‌ను అతి గోప్యంగా పంపించి మూల్యాంకణం జరిపిస్తున్నా మన్నారు. డైరెక్టరేట్ ఆఫ్ అకడమిక్స్ మరియు ప్లానింగ్ (డిఏపి) వారు ఒక యాప్‌ను రూపొందించి అనుబంధ కళాశాలల అధ్యాపకుల వివరాలను, పాన్, ఆధార్ కార్డుతో సహా పొందుపరుస్తున్నారని, దీని వలన వారి వివరాలను వెబ్‌సైట్‌లో అందుబాటులోకి తీసుకురాగలిగామన్నారు. ర్యాటిఫికేషన్‌ను పద్ధతి ప్రకారం నిర్వహించి అసిస్టెంట్ ప్రొఫెసర్లకు, అసోసి యేట్ ప్రొఫెసర్లకు పదోన్నతులు కల్పిస్తున్నామన్నారు. ఈనెల 17న గుంటూరు జిల్లా కోటప్పకొండ సమీపంలో జెఎన్‌టియుకె నరసారావుపేట కళాశాల నూతన భవనాలకు శంఖుస్థాపన చేశారని, దీనికై ప్రభుత్వం 85.94ఎకరాల స్థలం కేటాయించిందని, వచ్చే జూన్ లేదా జులైలోగా తృతీయ సంవత్సరం బీటెక్ విద్యార్థులను నూతన భవనాలలోకి తరలిస్తా మని, కొత్తగా అగ్రికల్చర్ ఇంజనీరింగ్, టెక్స్‌టైల్ ఇంజనీరింగ్ కోర్సులను ప్రవేశపెట్టబోతున్నామన్నారు. జెఎన్‌టియుకె దిగ్విజయంగా ఎంసెట్‌ను రెండు ఆఫ్‌లైన్ పద్ధతిలో ఒకసారి ఆన్‌లైన్ పద్ధతిలో నిర్వహించడం జరిగిందని, ఈ ఏడాది కూడా ఎంసెట్ ప్రవేశ పరీక్షను ఆన్‌లైన్ విధానంలోనే నిర్వహిస్తా మన్నారు. అంతేగాక పోలీస్ రిక్రూట్‌మెంట్, ఎన్టీఆర్ విద్యోన్నతి, ఏపి ట్రాన్స్‌కో, ఏపి జెన్‌కో మొదలగు పోటీ పరీక్షలను నిర్వహించామన్నారు. జెఎన్‌టియుకెలో ప్రతీ ప్రయోగశాలలోను సిసి కెమెరాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాలను పెంచామన్నారు. విద్యార్థులు చేరని కొన్ని కోర్సులను మూసివేస్తున్నామని, ఉత్తీర్ణత శాతాన్ని పెంచేందుకు రెండు సబ్జెక్టులలో మాత్రమే విద్యార్థులకు ఏడు లేదా ఎనిమిది గ్రేస్ మార్కులను కేటాయిస్తున్నా మన్నారు. విదేశీ విశ్వవిద్యాలయాలతో అనుసంధా నమై నిర్వహిస్తున్న ఐఐఎండిపి కోర్సుల స్ట్రక్చర్‌ను మార్చి 5సం॥ల బీటెక్ మరియు ఎంటెక్ డిగ్రీలను ప్రధానం చేస్తున్నామని, దీని ద్వారా విద్యార్థులు భారతదేశంలోని ఏ పోటీ పరీక్షకైనా అర్హులవుతారని తెలిపారు. ఈ ప్రెస్‌మీట్‌లో రెక్టార్ ప్రొ.కె.పూర్ణానందం, రిజిస్ట్రార్ ప్రొ.వివి.సుబ్బారావు, ఓఎస్‌డి ప్రొ.కెవి.రమణ, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ మరియు చీఫ్ ఇంజనీర్ ప్రొ.వి.రవీంద్ర, ఆర్&డి డైరెక్టర్ మరియు పిఆర్ఓ ప్రొ.సిహెచ్.సాయిబాబు, డిఏపి ప్రొ.సిహెచ్. సత్యనారాయణ పాల్గొన్నారు.